కేరళ డిజిపిగా పోరుమామిళ్ల వాసి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్లకు చెందిన ధర్వేష్ మోదిన్ కేరళ రాష్ట్ర డిజిపిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ధర్వేష్ పోరుమామిళ్లలోని బెస్తవీధిలో పుట్టి పెరిగారు. ఆయన తండ్రి అటవీశాఖలో ఉద్యోగం చేస్తున్నారు. ధర్వేష్ విద్యాభ్యాసం పోరుమామిళ్లలోనే సాగింది. డిగ్రీ, పీజీ తిరుపతిలో చదివారు. ఐఎఎస్ కావాలనే పట్టుదలతో కష్టపడి పరీక్షలు రాశారు. మొదటి సారి ఇండియన్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌కు ఎంపికయ్యారు. దాన్ని వదులుకుని మరో సారి ఐఎఎస్‌కు ప్రిపేర్ అయ్యారు. ఈ సారి ఐపిఎస్‌గా ఎంపిక కావడంతో కేరళ రాష్ట్రంలోనే అంచలంచెలుగా ఎస్‌పి నుంచి డిఐసి, ఐజి, ప్రస్తుతం డిజిపి స్థాయికి చేరుకున్నారు. తమ బాలమిత్రుడు కేరళ డిజిపిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

వరిధాన్యం ధరలకు రెక్కలు

రూ. 23 వేలు పలుకుతున్న ఏడాది నాటి ధాన్యం

గతంలో ఎన్నడూ ఇంత ధరలు చూడలేదంటున్న రైతులు

వరి ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పుట్టి (8బస్తాలు) రూ. 23వేలకు చేరుకున్నాయి. డిసెంబర్ నెలలో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8బస్తాల) ధర రూ. 12 వేల వరకు పలికాయి .ఆ తర్వాత జనవరి లో రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. ప్రస్తుతం రూ.21వేల వరకు చేరుకున్నాయి. గత ఏడాది సాగైన వరి ధాన్యం రూ. 23 వేలకు చేరుకున్నాయి.

వరి సాగు పై తగ్గుతున్న ఆసక్తి...

ఉమ్మడి కడప జిల్లాలో సాధారణంగా కేసి, కుందూ, బ్రహ్మసాగర్, మైలవరం, గండికోట, పలు చెరువుల కింద వరి పంటను అత్యధికంగా సాగు చేస్తున్నారు. దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వరిపంటను సాగు చేసేవారు. దాదాపు లక్ష మంది కౌలురైతులు వరిసాగుపై ఆధారపడి ఉన్నారు. వేలాదిమంది వ్యవసాయ కార్మికులు వరిసాగులో పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా వరుసగా మూడు సంవత్సరాలు వరిసాగులో నష్టాలు తప్పలాభాలు అనేవి లేకుండా పోయాయి. దీంతో క్రమంగా సాగు తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది 50వేల ఎకరాల వరకు సాగు తగ్గింది. దీనికి ప్రధానకారణం సరైన మద్దతు ధరలేకపోవడమే. ఎకరా వరి సాగుకు రూ.35 నుంచి 40వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయి. పుట్టి వరి ధాన్యం ధర నూర్పిడి సమయంలో రూ. పది వేల లోపు మాత్రమే ఉన్నాయి. 40బస్తాల దిగుబడి వచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఈ ఏడాది వరి సాగు ను తగ్గించారు. ఇతర ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 16 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. అలాంటిది ఈ ఏడాది 13322 ఎకరాలకు పరిమితమైంది. ధరలు, దిగుబడి పెరగడంతో రబీలో మాత్రం 4వేల ఎకరాలలో వరి సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది తిరిగి సాగు పెరిగే అవకాశం ఉంది.

దిగుబడి ఆశాజనకం..

గతంలో కంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి పెరిగినది. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ. 30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడి పెరగడం, ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగు ఖర్చులు పోను రైతులకు ఆదాయం చేకురుతోంది . గత ఏడాది మాత్రం అధిక వర్షాలకు, వరద తాకిడికి వరి పంట అధికంగా దెబ్బతింది. వర్షానికి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.6వేలు నష్టపరిహారం మంజూరైంది. గత ఏడాది ఖరీఫ్ లో సాగు చేసిన లో వరి ధాన్యం ధర రూ. 23 వేలకు పైగా ధర పలుకుతున్నాయి. దీంతో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచిన రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర అందుబాటులో ఉంది. జనవరిలో రూ. 12వేలు ఉన్న పుట్టి ధర ప్రస్తుతం క్రమేపీ పెరిగి రూ.22 వేలకు పైగా పలుకుతున్నాయి. గతంలో రూ. 17వేలకు మించేవి కావు. ధరలు పెరుగుతుండడంతో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని అమ్మకాలు చేపడుతున్నాం.

-రామ సుబ్బారెడ్డి, రైతు, బద్రిపల్లె.

గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర వచ్చింది. పాత వరి ధాన్యంతో పాటు వేసవిలో సాగు చేసిన వరి ధాన్యం ధరలు కూడా రూ. 20వేలు పలుకుతున్నాయి. గత ఏడాది పంట అధిక వర్షానికి దెబ్బతిన్నడం, ఈ ఏడాది సాగు తక్కువ కావడం, ఇతర ప్రాంతాలకు ఎగుమతికి అనుమతి వంటి కారణాలతో ధర పెరుగుతున్నది.

-సుబ్బరాయుడు, వరి ధాన్యం వ్యాపారి, చాపాడు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ



కడప నగర శివార్లలోని మామిళ్లపల్లి ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాష ముస్లిములు

వార్తలు 6లో

క్రాప్ ఇన్సూరెన్స్‌కు కసరత్తు

రూ.204 కోట్లతో ప్రతిపాదనలు
జులై 8న నిధులు విడుదల?

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గత ఖరీఫ్ సీజన్‌లో అకాలవర్షాలు, వర్షాభావాల కారణంగా దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ విడుదలకు కసరత్తు ఊపందుకుంది. జిల్లా వ్యవసాయ శాఖ 2022-23 ఖరీఫ్ సీజన్‌లో 1,93,095 ఎకరాల్లో పంటల సాగుకు ప్రణాళిక రూపకల్పన చేసిన సంగతి తెలిసిందే. ఖరీప్ సీజన్ సీజన్ ముగింపు నాటికి పత్తి, కందులు, ఉల్లి, వరి, నిమ్మ, వేరుశనగ, ఇతర రకాల పంటలు అకాలవర్షాలు, వర్షాభావాల కారణంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యవసాయ శాఖ జిల్లాలోని రైతులు రూ.204 కోట్ల మేర నష్టపోయినట్లు గుర్తించి, దెబ్బతిన్న పంటల వివరాలను అందజేసింది. ప్రభుత్వం తాజా ఖరీఫ్ సీజన్ నాటికి క్రాప్ ఇన్సూరెన్స్‌ను విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యవసాయ శాఖ దెబ్బతిన్న పంటలను ఎన్యూమరేషన్ చేసి అందజేసింది. జులై ఎనిమిదిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి సందర్భంగా క్రాప్ ఇన్సూరెన్స్ నిధులను విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాన మైన వివరాలైన దెబ్బతిన్న పంటల విస్తీర్ణం, ఆయా మండలాల్లో పంటల వివరాలు, బాధిత రైతుల వివరాల జాబితాను తయారు చేసే పనుల్లో జిల్లా వ్యవసాయశాఖ నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది.

'ఉపాధి' కోసం పోరాటాలు ఉధృతం

వ్య.కా.స రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

రాష్ట్రంలో ఉపాధి పనులు కల్పించి, కూలి రేట్లు పెంపుదల కోసం ఉధృత పోరాటాలు చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. బ్రహ్మంగారి మఠంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభ మయ్యాయి. ప్రారంభానికి ముందు ఆయన సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు ,ఆంజనేయులు సుందరయ్య చిత్రపటానికి పులమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలో ఉపాధి పనులు తగ్గాయని, కేంద్రప్రభుత్వం ఉపాధి పనులకు 25శాతం బడ్జెట్‌లో నిధులు తగ్గించిందని చెప్పారు. పెరుగుతున్న గ్రామీణ పేదల జనాభాకు తగ్గట్లు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరించిందని వాపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం, ప్రతిపక్ష పార్టీలు కనీసం స్పందించటం లేదని పార్లమెంట్‌లో కనీసం నోరు మెదపటం లేదని వారు విమర్శించారు. దేశంలో ధరలన్నీ పెరిగిపోయాయని వాటికనుగుణంగా రూ. 600 కూలి పెంచి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రూరల్ ప్రాంతాలు పట్టణాల్లో కలవడంతో మున్సిపాల్టీలుగా మారాయని, తద్వారా గ్రామీణ పేదల సంఖ్య పెరిగిందని చెప్పారు. అందువల్ల పట్టణ, గ్రామీణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని పేర్కొన్నారు. శిక్షణా తరగతుల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లయ్య, సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు. జి.శివకుమార్ వి.అన్వేష్, అనంతపురం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నంద్యాల జిల్లా అధ్యక్షులు సుధాకర్. హిందూపురం జిల్లా అధ్యక్షులు, ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, వీరయ్య, రాయప్పా, కర్నూల్, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, చిత్తూరు జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం

తలపడుతున్న కడప - కర్నూలు జట్టు

107 పరుగులుచేసిన ప్రనిల్‌రెడ్డి

101 పరుగులు చేసిన మన్విత్

ప్రజాశక్తి - కడప

కడప జట్టుకు చెందిన ప్రనిల్ రెడ్డి సెంచరీ (107 పరుగులు) చేయడంతో కడప కర్నూలు జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మొదటిరోజు వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎస్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కడప - కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలిత బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ఆ గట్టులోని ఏ. సాయి సూర్య తేజ రెడ్డి 93 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్ఎండి అస్లాం 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 237 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కడప జట్టులోని ఆర్. ప్రనిల్ రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 98 పంతులను ఎదుర్కొని 14 బౌండరీలు, ఒక బౌండరీ సిక్స్ సహాయంతో 107 పరుగులు చేశాడు.

116 పరుగుల తేడాతో విజయం సాధించిన అనంతపురం జట్టు

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో 116 పరుగుల తేడాతో అనంతపురం జట్టు నెల్లూరు జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. ఆ జట్టులోని వీరారెడ్డి 68, వెంకట్ లోకేష్ 68 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని వెంకయ్య అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 309 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 38.5 ఓవర్లలో 192 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. ఆ జట్టులోని మన్విత్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 95 బంతులను ఎదుర్కొని 8 బౌండరీలు, 6 బౌండరీ సిక్సుల సహాయంతో 101 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. అనంతపురం జట్టులోని ప్రదీప్ 4, తన్వీర్ 3 వికెట్లు తీసుకున్నారు.

హంస వాహనంపై శ్రీసౌమ్యనాథుడు

హంస వాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాన్ని టిటిడి అర్చక స్వాములు ఆధ్వర్యంలో మాడ వీధుల్లో భక్తుల గోవింద నామస్మరణలు, కోలాటాలు డప్పు వాయి ద్యాల మధ్య వేడుకగా శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై సరస్వతి దేవి అలంకారంలో శ్రీసౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేషా లంకరణలో మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ మాజీ అధ్యక్షులు అరిగెల సౌమిత్రి, అరిగే నాని, కాకి చంద్ర, సోమిశెట్టి ప్రభాకర్, నాగ సుబ్బయ్య, అర్చకులు సునీల్, సాయి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరు మంజనం రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ నటేషన్ బాబు తెలిపారు. ప్రజలు పాల్గొన్నాలని పేర్కొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని చెంచయ్యగారిపల్లెకు చెందిన బాల నరసింహులు అనే రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి కోరారు. వ్యవసాయం గిట్టుబాటు గాక, వేసిన మూడు బోర్లు ఎండి పోవడంతో అప్పుల బాధతో ఆ రైతు ఆత్మహత్య చేసు కున్నాడు. ఆ కుటుంబాన్ని గురువారం ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు పరామ ర్శించారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ నరసింహులు కుటుం బాన్ని ఇంతవరకు వ్యవసాయశాఖ అధికారులు, రైతు భరోసా అధికారులు, సచివాలయ సిబ్బంది, అధికార పార్టీ నాయకులుగానీ పరామ ర్శించలేదన్నారు. వారికి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. అప్పు ఇచ్చినవారి వేధింపుల నుంచి ఆ కుటుంబాన్ని పోలీస్ అధికారులు కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రావలసిన నష్టపరిహారం ఇవ్వాలని, భార్య పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులను కలిసి నివేదిక అందజేస్తామని దస్తగిరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గోవిందు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న సుబ్బారెడ్డి

ఖాజీపేట : మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డి(45) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు సేవించి గురువారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మృతునికి ఒక కుమా రుడు ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉన్నత విద్యను అభ్యసిస్తుండగా, కుమార్తెకు వివాహమైంది బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు వెల్ల డించారు. మృతుడు పంట పెట్టు బడి కోసం అప్పులు చేశాడు. వేసిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడం, తీసుకున్న అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

కలసపాడు : మండలంలోని బంజర భూములన్నింటిని అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్. గురయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014లో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు మాత్రమే అసైన్‌మెంట్ కమిటీ నిర్వహించి కొంత భూమిని పేదలకు ఇచ్చారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడా పేదలకు పట్టా ఇవ్వలేదని వాపోయారు. మండలంలో ముఖ్యంగా రామాపురం, నీలాపురం, గంగాయపల్లె, చింతలపల్లి, మహానందిపల్లి, తెల్లపాడు, కలసపాడు ప్రాంతాల్లో ఉన్న బంజరు భూములను కబ్జాదారులు వారికి అనుగుణంగా ఉన్న వారిని బినామీలుగా మార్చుకుని అసైన్‌మెంట్ కమిటీ లేకుండా దొంగపట్టాలు సృష్టిం చుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తహాశీల్దార్ వెంటనే స్పందించి బంజరు భూములను పేదలకు పంపిణీ చేయాలని లేని పక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగోన్నతలు, బదిలీల కారణంగా స్థానచలనమైన ఎంఇఒలు-2, పిజిటిలు, భాషాపండితులు, కొంతమంది ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు తగు చర్యలు తీసుకోవాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రమణారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి కోరారు. గురువారం కడపలోని వివిఆర్ ఎస్టీయు భవన్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలలో కొంతమంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివిధ మండలాలకు ఎంఇఒ-2లుగా, పిజిటిలుగా వెళ్లారని తెలిపారు. వారి జీతాల చెల్లింపులో నెలకొన్న సందిగ్ధతకు తెరదించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉండే భాషాపండితులు కూడా పనిసర్దుబాటు కింద బదిలీ చేయబడ్డారని పేర్కొన్నారు. వారి జీతాల చెల్లింపులో స్పష్టత ఇచ్చి చెల్లించాలన్నారు.సమావేశంలో రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు బాలగంగిరెడ్డి, గురు కుమార్, సీనియర్ జిల్లా నాయకులు సురేష్ బాబు, జయ రామయ్య, శంకరయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒకు వినతి

ఇటీవల నిర్వహించిన బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భాగంగా నూతన పాఠశాలలో చేరిన కొంతమంది ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు కొన్ని కారణాల వల్ల జూన్‌లో వేతనాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిఇఒ రాఘవరెడ్డిని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్ రెడ్డి కోరారు. గురువారం డిఒకు వినతిపత్రం అందజేశారు. గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కలసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్టకౌన్సిలర్ ఖాదర్ బాష, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి, జిల్లా కౌన్సిలర్ శ్రినివాసులు పాల్గొన్నారు.

దువ్వూరు ఎస్ఐగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు ఎస్ఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. పెద్దముడియం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడున్న ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు. బాధ్యతల అనంతరం ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జూదం, మట్కా., ఎర్రచందనం, అక్రమ మద్యం రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

గంజాయి కేంద్రాలుగా విద్యాలయాలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు కావడంతోపాటు కొన్ని విద్యాలయాలు గంజాయి, డ్రగ్స్, మద్యం, బెట్టింగ్ కేంద్రాలుగా మారాయని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల పాలిట శకుని మేనమామ, కంస మేనమామగా తయారైనట్లు ఎద్దేవా చేశారు. పాఠశాల విద్యను కుక్కలు చింపిన విస్తరిలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 3,4,5 తరగతులను ఎలిమెంటరీ పాఠశాలల నుండి విడగొట్టి హైస్కూల్లో విలీనం చేయడం పిచ్చి తుగ్లక్ చర్య అన్నారు. పాఠశాలలు విలీనంతో డ్రాప్ ఔట్స్ పెరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మఒడి పథకం ఒక తల్లికి, ఒక బిడ్డకే వర్తిస్తుందని చెప్పడం, మిగతా బిడ్డలను బడికి పంపవద్దని పరోక్షంగా చెప్పినట్లుందన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ 2019 నవంబర్ 20న జగన్ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.85 ఒక చారిత్రక తప్పిదమని తులసిరెడ్డి పేర్కొన్నారు. పిజి విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన రద్దు చేస్తూ 2020 డిసెంబర్ 25న జారీ చేసిన జిఒ నెం.77 వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని తెలిపారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌టిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏకలవ్య జయంతి ఉత్సవాలను గురువారం జమ్మలమడుగులో ఎన్‌టిఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగు లకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పగడాల నాగన్న, శబరి కాలనీ గిరిజన యూత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎరువాకమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని శ్రీ ఎరువాకమ్మ గంగమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో నగర పురవీధుల్లో నాలుగు రోడ్ల కూడలి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో భూపేష్‌రెడ్డి

ఖాజీపేట : తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలందరూ గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక కోటంగురువాయ పల్లెలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేశారు. టిడిపి రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముత్యాల కిరీటం వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి పబ్బతి సురేష్‌బాబు అనే దాత ముత్యాల కిరీటాన్ని విరాళం ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్ తెలిపారు. వేంపల్లె గ్రామానికి చెందిన పబ్బతి సురేష్‌బాబు ధర్మపత్ని లక్ష్మి రూ.20 వేలు విలువ చేసే ముత్యాల కిరీటం, ముత్యాల తోరణం, వింజామర్లు ఏకాదశి సందర్భంగా దేవస్థానానికి ఇచ్చినట్లు చెప్పారు. దాతకు దేవస్థానం తరపున సత్కరించి, ప్రసాదం అందజేశారు. భక్తుల సహకారం మరువలేనిదన్నారు.

ముత్యాల కిరీటం అందజేస్తున్న దాత

లోకేష్‌ను కలిసిన ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం కాకువారిపాలెం దగ్గర యువగళం పాదయాత్ర శిబిరంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను ప్రొద్దుటూరు పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజ కవర్గంలోని ప్రజల సమస్యలు, ప్రస్తుత రాజ కీయ పరిస్థితులుపై చర్చించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ, టిడిపి ఎన్నికల మేనిఫెస్టో ప్రజల్లోకి ఎలా తీసుకుపోతున్నారనే విషయాలపై లోకేష్ చర్చించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్ : పట్టణ శివారులో ఉన్న శిల్పారామంలో బక్రీద్ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ముస్లిం కుటుంబాలు ఆనందోత్సాహాలతో గడిపారు. మనోహర్, మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ వారి సౌజన్యంతో విజిల్ డ్యాన్స్ అకాడమీ కడప వారి చిన్నారులచే శ్రీ సింహ మాస్టర్ అధ్వర్యంలో వారి శిష్యబృందం ఏర్పాటు చేశారు. జానపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

జన జాగృతి సభను విజయవంతం చేయండి

సంబేపల్లె (రాయచోటి): జులై ఏడవ తేదీన నిర్వహించబోయే మాదిగల జన జాగృతి సభను విజయంవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్దవీటి రమణయ్య పేర్కొన్నారు. గురువారం సంబేపల్లి మండలం ప్రకాశ్ నగర్‌కాలనీలో కరపత్రం విడుదల చేశారు. రాష్ట్ర కో-కన్వనర్ ఎస్.రామాంజనేయులు ఆదేశంతో సంబేపల్లె ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు జల్లా మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు పి రమణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వి.వెంకటరమణ, బి.లక్ష్మయ్య, ఆదినారాయణ, వీరనాగయ్య, వెంకటస్వామి రఘు, జెవి.వెంకట రమణ, మహిళా కార్యకర్తలు జె.లక్ష్మి పార్వతి, సిఎం.లక్ష్మీదేవి, వెంకటరమణమ్మ, జయ రాములు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పలు చెరువులు, వాగులు, వంకల్లో మట్టిని వారి ఇష్టారాజ్యంగా అక్రమంగా తరలిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట, అనుమతుల పేరిట దర్జాగా మట్టిని, ఇసుకను తరలిస్తూ సహజ వనరులను దోచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ, భూగర్భ గనులు శాఖ, జలవనరుల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో మట్టి మాఫియా చెలరేగిపోతున్నారనే ఆరోపణలున్నాయి. మండలంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగిస్తూ ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో పలు గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారుల అండదండలతోనే మట్టి ఇసుక మాఫియా చెలరేగిపోతున్నారని పలువురు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. సహజ వనరులను సంరక్షించాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా ప్రదర్శించడంతోపాటు, అక్రమదారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని కన్నెలవాగు చెరువు, సమీప రావులపల్లి చెరువు, నాగసానిపల్లె సమీపంలోని గుట్ట, నాగనాథేశ్వర ఆలయ పరిసర ప్రాంతాల్లో నుంచి మట్టి జోరుగా అక్రమ రవాణా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణా దారులపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

నాగనాథేశ్వరస్వామి సమీప ప్రాంతంలో ఏర్పడిన పెద్దపాటి గుంతలు

స్కూళ్లల్లో పుస్తకాల పేరుతో వ్యాపారం

- మోతమోగుతున్న ధరలు.. చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు బినామీ పేర్లతో వ్యాపారం ప్రారంభించారు. ఈ వ్యాపారం దాదాపు కోట్లలో సాగుతున్నా విద్య శాఖ, వాణిజ్యశాఖ మాత్రం కన్నులొట్టపోయి చూస్తోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విద్యార్థులకు కావాల్సిన పాఠ్య, నోటు పుస్తకాలు, అట్టలు, పెన్నులు, పెన్సిల్, పుస్తకాలకు అతికించుకునే లేబుల్ కూడా ఆ పాఠశాలల్లోనే కొనాలి. ఇది ఆయా కార్పొరేట్, ప్రయివేటు యాజమాన్యాల నిబంధన. కొన్ని పాఠశాలల్లో అవసరం లేని వాటిని కూడా విద్యార్థులకు అంటకడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇవన్నీ అందుబాటులో ఉన్నా అక్కడ కొనడానికి పాఠశాలల యాజామాన్యాలు అంగీకరించడం లేదు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 150 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. అందులో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు దాదాపు 60వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు, ఇతర వాటికి దాదాపు రూ.10 వేలు ఖర్చు అవుతోంది. ప్రతి ఏటా ఇలా దాదాపు కోట్లలో వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. వాణిజ్య పన్నుల శాఖ నిబంధన ప్రకారం రూ.లక్ష వ్యాపారానికి నెలకు రూ.ఐదు వేలు పన్ను చెల్లించాలి. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాల వ్యాపారం మాత్రం జీరో దందా సాగుతోంది. బినామీ రూపంలో విద్యార్థుల నుంచి కోట్లలో వ్యాపారం జరుగుతున్నా.. ప్రభుత్వానికి పైసా ఆదాయం లేదు. నాలుగు బస్తాలు పప్పులు తెచ్చుకుని అమ్ముకుని బతికే చిరు వ్యాపారుల వద్ద బిల్లులు లేవని వాణిజ్యశాఖ అధికారులు ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తారు. పైగా వారు చెల్లించాల్సిన పన్నులకు అదనంగా ఐదు రెట్లు వసూలు చేస్తారు. కాదంటే కేసులు తప్పవు. అయినా సరుకు మాత్రం తిరిగి రాదు. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో ఇంత దర్జాగా అనుమతులు లేకుండా సాగుతున్న వ్యాపారంపై విద్యశాఖ, వాణిజ్యశాఖ అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదన్నది ప్రశ్న. వ్యాపారం ఏదైనా రూ.7.5 లక్షలకు మించితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. క్రయ విక్రయాలకు సంబంధించి వ్యాపారం జరిగిన మొత్తంలో పన్నులు చెల్లించాలి. బిల్లులు లేక పోయినా, పన్నులు కట్టకపోయినా చర్యలు తీసుకోవచ్చు. కాని ఇవి కాగితాలకు, మాటలకే పరిమితం అవుతున్నాయి. ఇదే నిజమైతే కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు అనుమతులు లేకుండా కోట్లలో జీరో వ్యాపారం చేస్తున్నా అటు వాణిజ్య పన్నులు శాఖ, ఇటు విద్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. అదేమంటే విక్రయదారులు బినామీ పేర్లతో పుస్తక దుకాణాలు, వస్త్రదుకాణాల పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారని అధికారుల వాదన.

పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యకు దూరం

అధిక ఫీజులతో పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యకు దూరమవుతున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను పుస్తకాలు, దుస్తులు, పెన్నులు పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కె. సత్యనారాయణ, సిపిఎం కార్యదర్శి, ప్రొద్దుటూరు

పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్మితే ప్రత్యక్ష ఆందోళన

అక్రమ సంపాదనే ధ్యేయంగా పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను కార్పోరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నాయి. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతాం.

- సగిలి రాజేంద్ర ప్రసాద్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కడప

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

గత ప్రభుత్వంలో విస్మరించిన గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమయ్యపల్లి నుంచి తిమ్మాయిపల్లెకు రూ.19 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న తారురోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తారు రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా ఉన్నాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తిస్థాయిలో నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా రోడ్లు బాగున్నాయన్నారు. త్వరలో పంట పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకచర్యలు చేపడుతున్నామన్నారు. డ్రయినేజీ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్‌నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, దువ్వూరు ఎంపిపి జయచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, రవి, వైసిపి నాయకులు రఘురామయ్య పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ

చాపాడులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతిబింబింపజేస్తుందని, ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయమని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా సందేశం ఇచ్చారు. నగర శివార్లలోని మామిళ్లపల్లి ఈద్గా మైదానంలో మౌలానా ముఫ్తీ రహీముల్లా ఖాన్ ఖాస్మీ ఆధ్వర్యంలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ముస్లిములు జరుపుకుంటున్నారని చెప్పారు. సమస్త మానవాళి కోసం ప్రవక్త చేసిన త్యాగాలను ఆయన స్మరించుకున్నారు. బక్రీద్ ప్రార్థనల అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాని ప్రజలకు సందేశానిచ్చారు. . దేశం, రాష్ట్రం, జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరారు. **మదరసా సమస్యను సిఎం దృష్టికి తీసుకెళతాం :** అనంతరం స్థానికంగా మదరస సంస్థకు సంబంధించిన సమస్యను పలువురు ముస్లిం పెద్దలు ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందింస్తూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు అఫ్జల్ ఖాన్, ఎస్.బి.అహ్మద్ ఖాన్, ఉమేర్, కార్పొరేటర్ షఫీ, ఇతర మైనారిటీ, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. **అమీర్‌బాబుకు బక్రీద్ శుభాకాంక్షలు :** బక్రీద్ పండుగ సందర్భంగా అమీర్ బాబును టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం టిడిపి నగర ఉపా ధ్యక్షులు కొండా సుబ్బయ్య కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి. ఎస్. ఆమీర్ బాబుకుపండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని అమీర్ బాబు నివాసంలో నగర ఉపాధ్యక్షులు వారి మిత్రబృందం శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా కొండ సుబ్బయ్య మాట్లా డుతూ కులమతాలకు అతీతంగా బక్రీద్ పర్వదినాన్ని చేసుకోవాలని కోరారు. కడపలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు అతీతంగా పండు గలు చేసుకోవడం ఆన వాయితిగా వస్తుందన పేర్కొన్నారు. అమీర్‌బాబు మరెన్నో రాజకీయ పదవులు పొంది ఇంకా ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాం క్షించారు. రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, డివి జన్ చార్జిలు బండి జయ శేఖర్, 47 డివిజన్ జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, కుమ్మరకుంట నరసింహ, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులు, బలపలూరు వెంకటేష్, బండారు ప్రసాద్ పాల్గొన్నారు. **చాపాడు :** ఈదుల్ జుహాన్ (బక్రీద్) మండల పరిధిలోని ఈద్గా ప్రాంగణాల్లో ముస్లింలు గురువారం ఆనందోత్సాహాలతో ఘనంగా ఆచరించారు. బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను మత పెద్దలు వివరించారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాలు ప్రత్యేక ప్రార్థనలతో మార్మోగాయి. చాపాడు, అల్లాడుపల్లె, మడూరు, వెదురూరు, రాజుపాలెం, తిమ్మాయపల్లె, కేతవరం, ఖాదర్‌పల్లె ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **దువ్వూరు :** ఈద్గా ప్రాంగణంలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ అని మత గురువు సాబ్జు, అబ్దుల్ కరీం తెలిపారు. కానగూడూరు, నేలటూరు, యర్రబల్లె, క్రిష్ణంపల్లె, చింతకుంట, గుడిపాడు, జిల్లెల్ల, చల్లబసాయపల్లె, యల్లాలకొట్టాలులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక వస్త్రధారణ, సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. **జమ్మలమడుగు :** ప్రవక్త ఇస్మాయిల్ జబీబుల్లా త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు పవిత్ర బక్రీద్ పండుగ చేసుకుంటారని, ఈ పర్వదినాన శక్తి ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా కుర్బానీ పాటించాలని జమ్మల మడుగు జామి యా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా షాదిక్ భాషా ఖాద్రి పేర్కొన్నారు. పట్టణంలోని పెన్నానది ఒడ్డున గల అతి పురాతనమైన షాహి ఈద్గా మైదానంలో జమ్మల మడుగు పట్టణం, మండల పరిధిలోని ముస్లింలు వేలాది సంఖ్యలో నమాజ్ ఆచరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సాదిక్ పాషా ఖాద్రి బక్రీద్ సారాంశాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. **పులివెందుల టౌన్ :** పట్టణంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానాలు చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **ముద్దనూరు :** త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. తాడిపత్రి రహదారిలోని ఈద్గా, మండలంలోని యామవరం, ఉప్పలూరు, మంగపట్నం ఈద్గాల వద్ద మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. **వేంపల్లె :** త్యాగనిరతికి నిదర్శనం ఈదుల్ అజహ పండుగ (బక్రీద్) అని మౌలానా మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పులివెందుల రోడ్డులోని బిస్మిల్లా మసీదులో, షాదీఖానా వద్దనున్న ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. **ఖాజీపేట :** బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు అల్లాహ్ సందేశాన్ని చదివి వినిపించారు. దుంపలగట్టు, కొత్తపేట, చెన్నముక్కపల్లె ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దుంపలగట్టు ఈద్గాలో టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


సందేశమిస్తున్న ఖాద్రి

ఆడపిల్లను చదవనివ్వాలి.. ఎదగనివ్వాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆడపిల్లను చదవనివ్వాలి.. ఎదగనివ్వాలని కల్లూరు వైద్యాధికారి డాక్టర్ శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్) ఆధ్వర్యంలో గురువారం అనిబిసెంట్ ఉన్నత పాఠశాలలో 'బేటీపడావో-బేటీబచావో' పిసిపియన్‌డిటి చట్టం-94పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు, వివరాలు వెల్లడించడం.. గర్భస్రావం చేసేవారు, చేయించుకునేవారు, ప్రోత్సహించేవారు చట్టం ప్రకారం నేరస్తులన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే అన్నారు. చట్ట విరుద్ధంగా లింగనిర్ధారణ చేసే వైద్యుల పేర్లు రాష్ట్ర వైద్య మండలి నుండి తొలగిస్తారని తెలిపారు. అదే తప్పు మరోసారి చేస్తే వారి పేరును శాశ్వతంగా తొలగిస్తారని అన్నారు. సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూతురంటే కాదు భారం..కుటుంబానికి వరం అన్నారు. గర్భస్రావానికి పాల్పడడం ఆమె ఆరోగ్యంతో ఆటలాడడమే అవుతుందన్నారు. అనంతరం టిబిరోడ్డు, సుబ్బిరెడ్డి కొట్టాల వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ రీసోర్స్ పర్సన్ రాజేశ్వరి, ఆరోగ్యసిబ్బంది, ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వైద్యుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైద్యుల సేవలు మరువలేనివని, వారు కంటికి కనిపించని దేవుళ్లని గడియారం సాహితీ పీఠం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ఎల్. నారాయణరెడ్డి, బండారు శ్రీనివాసులు తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అగస్టీన్ రాజు, డాక్టర్ కె.పి.రవీంద్రను గురువారం వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ముందస్తుగా తమ సంస్థ ఆధ్వర్యంలో సత్కరించామన్నారు. జమ్మలమడుగు ప్రాంతంలో డాక్టర్ అగస్టీన్‌రాజు సేవలు మరువలేనివన్నారు. కంటి వైద్యులుగా రవీంద్ర సుమారు లక్షా డెబ్బై వేలకుపైగా ఆపరేషన్లు చేయడం ఒక రికార్డు అన్నారు. ఇది జమ్మలమడుగు ప్రాంతానికే గర్వకారణమన్నారు. తమకు జరిగిన సత్కారం పట్ల డాక్టర్లు అగస్టీన్, రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడియారం సాహితీ పీఠం సభ్యులు మిరియాల శివగణపతి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ, గిరి, రాఘవ, దాదా ఖలందర్, అమీర్, లైబ్రేరియన్లు జింకా చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డాక్టర్లను సత్కరిస్తున్న గడియారం సాహితీ పీఠం సభ్యులు

1 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ జులై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ రంగనాథరెడ్డి డాక్టర్ కల్పన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించాలని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బక్రీద్ పురస్కరించుకొని స్థానిక నగిరిగుట్టలోని నైట్ షెల్టర్‌లో వృద్ధులకు అన్నదానం చేశారు. ఉభయ రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షులు ఓతూరు రసూల్ సాహెబ్ గురువారం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, దేవాలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, మల్లికార్జున, వైసిపి నాయకులు నూరుల్లా, రాజేష్ నాయుడు, చలపతి, గంగరాజు, హరి పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంగా మానవతా సేవా సంస్థ భరోసానిస్తుందని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, ప్రొద్దుటూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీని వాసులు తెలిపారు. గురు వారం స్థానిక పెన్షనర్స్ హోంలో మానవతా సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్ర మాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వరప్రసాద్, శ్రీనివాసులు, సెంట్రల్ కమిటీ నాయకులు గోపి, వీరారెడ్డి, చక్రపాణి, డివి కొండారెడ్డి, అధ్యక్షులు రాఘవరెడ్డి, హరిచంద్రరెడ్డి, జిల్లా సభ్యులు కృష్ణారెడ్డి, శేష మహేశ్వరమ్మ హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

అట్టహాసంగా బండలాడుగు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లె ఎస్‌సి కాలనీలో చర్చి వార్షికోత్సవం సందర్భంగా గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బి.కేశవరెడ్డి ఎద్దు 4120 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.50 వేలు గెలుచుకున్నాయి. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ ఎద్దు 4028 అడుగులులాగి రెండవ బహుమతి రూ.40 వేలు, గుంటూరు జిల్లా కొండపాటుకు చెందిన విశ్వనాథరెడ్డి ఎద్దు 3784 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.30వేలు, పల్నాడు జిల్లా ఇనిమెట్లకు చెందిన వెంకటేశ్వర్లు ఎద్దు 3603 అడుగులు లాగి నాలుగవ బహుమతి రూ.20వేలు, కడప జిల్లా బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దు 3584 అడుగులు లాగి 5వ బహుమతిగా రూ.10వేలు కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బురుజుపల్లికు చెందిన రోహిత్‌రెడ్డి ఎద్దు 3551 అడుగులులాగి 6వ బహుమతిగా రూ.8వేలు, నంద్యాల జిల్లా పిఆర్ పల్లెకు చెందిన చెన్నారెడ్డి ఎద్దు 3327 అడుగులు లాగి 7వ బహుమతి రూ.5వేలు గెలుచుకున్నాయి. చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన బండలాగడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మహేశ్వర్‌రెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మహేష్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆజాద్ హత్యకు యోగీ సర్కార్ కుట్ర : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ ఆజాద్ హత్యకు యోగీ ఆదిత్యనాథ్ సర్కార్ కుట్ర చేస్తోందని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై జరిగిన హత్యాప్రయత్నాన్ని ఖండిస్తూ తన కారాల్యయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహరాన్‌పూర్‌లో ఆజాద్‌పై జరిగిన తుపాకుల దాడి ఇందులో భాగమేనని పేర్కొన్నారు. ఉత్తర భారతంలో ఆజాద్ బలమైన నాయకుడని తెలిపారు. అయన ఆజాద్ సమాజ్ పార్టీని స్థాపించి ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని చెప్పారు. సహరాన్‌పూర్‌లో ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా, సంఘ్ పరివార్ మూకలు ఆజాద్ కారు మీద తుపాకులతో కాల్పులు జరిపాయని తెలిపారు.